

లేనట్లుగా అతను కూడా తన లాల్చీ జేబులోంచి ఒక మంగళసూత్రం తీసి 'ముందు ఇది చూడండి!' అంటూ చమన్‌లాల్ చేతిలో పెట్టాడు. ఆమె పొట్లం విప్పేసరికి చమన్‌లాల్ అతనిచ్చిన మంగళసూత్రం పరీక్షించడం పూర్తిచేసి త్రాసులో వేశాడు. అతను ఆమె విప్పుతున్న పొట్లంవైపు చూసి ఉలికి పడ్డాడు. అది కూడా మంగళసూత్రమే! "తాకట్టా? అమ్మేస్తారా?" అన్నాడు చమన్‌లాల్, ఆమె చేతిలోని వస్తువు చూస్తూ. "అమ్మేస్తానండీ" అందామె కొద్దిగా వణికే గొంతుతో. "మీ సంగతి కాదమ్మా! ఆయనను అడుగుతున్నాను" అన్నాడు చమన్‌లాల్. "నన్నేనా అడిగేది?–అమ్మకానికేలెండి. త్వరగా కానీయండి" అన్నాడతను. "ఉండండి మరి! తొందరైతే ఎలాగ? ఏదమ్మా, మీ వస్తువు ఇలా యియ్యండి" అంటూ ఆమె చేతిలోని వస్తువును అందుకున్నాడు. "కాస్త వేగం దబ్బివ్వండి. చాలా అర్జెంటు" అందామె–బాధగా. ఆమె పెళ్ళయి సంవత్సర కాలేదింకా! ఇంతలో ఆమె భర్తకి టి. బి. అని తెల్సింది. దొరికినంతవరకూ అప్పులు చేసి వైద్యం చేయించింది. ఇంక మరి అప్పు దొరకని సమయంలో, తగ్గు ముఖం పట్టిన వ్యాధిని నిర్లక్ష్యం చేయలేక ఆమె తన మాంగల్యాన్ని అమ్మడానికి సిద్ధపడింది.

అతని పేరు శంకరం! అతడొక పక్కా త్రాగుబోతు. మొదట్లో మామూలుగానే, సరదాకి. కొద్ది కొద్దిగా త్రాగేవాడు. రానురాను వ్యసనం ముదిరి పక్కా త్రాగుబోతుగా మారాడు. అతని భార్యకి చాలా నగలుండేవి. అవన్నీ అతని వ్యసనానికి హరించుకుపోయాయి. చివరికి ఆమె మెడలో మాంగల్యం మాత్రం మిగిలింది. అదివ్వనసీ, ఇవ్వలేనని ఆమె ఏడ్చింది. భర్తగా తనకున్న హక్కు పురస్కరించుకుని, ఆమెని చావగొట్టి, అది బలవంతంగా లాక్కుని మరీ తెచ్చాడతను.

అంతలోనే కొద్దిగా నలిగిన టెరికాట్ పాంటూ, టెరికాట్ షర్టూ, ఉంగరాల జుత్తూ, కాస్త నీరసంగా వున్న మొహంతో మెట్లెక్కి వస్తున్న ఒక యువకుని చూసి సంతోష పూర్వకంగా ఆహ్వానించాడు సేట్‌జీ! పాంటు జేబులోంచి ఏదో తీసి సేట్‌మీదకి గిరాటేస్తూ "అర్జెంట్! క్విక్!" అన్నాడు ముక్తసరిగా అతను. సేట్ దాన్ని ఒడుపుగా అందుకున్నాడు. అదొక మంగళసూత్రం! అతనిపేరు రాజు. అతడి వేషం ఘరానాగా వున్నా, అతడు భోజనం చేసి నాలుగు రోజులైంది. అతని వృత్తి పిక్‌పాకెటింగ్! దొరికితే కటకటాల వెనుక! దొరకనన్నాళ్ళూ, పేరుకుతగ్గట్టే రాజా జీవితం! అతనిప్పుడే ట్రైన్ దిగి వస్తున్నాడు. ట్రైన్‌లో కొట్టేసిన వస్తువది! దాన్ని కూడా పరీక్షించడం పూర్తిచేసి, త్రాసులో వేశాడు సేట్‌జీ! కాస్త ముందు వెనుకల్లో వచ్చిన ముగ్గురికీ ఒకేసారి డబ్బిచ్చి పంపేశాడు. మరోసారి దేముడికి నమస్కారం చేసి మూడు మంగళసూత్రాలనూ ఒకేసారి సొరుగులోకి పడేశాడు అతను. ఏ పరిస్థితుల్లో అవి అక్కడికి చేరినా, సేట్‌జీ దృష్టిలో వాటి విలువ ఒకటే!

—విశాఖ

## తిరుగులేని ఋజువు

హెడ్‌క్వార్టర్స్ వదలి ఎక్కడికీ వెళ్ళకూడదనే షరతుమీద సార్జంట్ సుబ్బారావుకి వారంరోజులు సెలవు దొరికింది. అదే మహాభాగ్యమని పక్క ఊరిలో వున్న భార్యను ఆ వారంరోజులు తనతో గడపవలసిందిగా ఆహ్వానిస్తూ ఉత్తరం రాసేశాడు. లగేజ్ వీలయినంత తక్కువగా వుండాలని మరీమరీ రాశాడు.

భర్త చెప్పినట్లే చిన్న సూట్‌కేస్‌లో తన బట్టలు, టాయిలెట్ సామగ్రి మాత్రం తీసుకుని బయలుదేరింది సూర్యకాంతం. స్టేషనుకెళ్ళి ఆమెను రిసీవ్ చేసుకుని దగ్గర్లోనే వున్న హోటల్ కెళ్ళాడు సుబ్బారావు.

అయితే ఆ ఊళ్ళో హోటల్ మేనేజర్లమీద ఒక ఆంక్షవుంది. అదేమంటే 'గది కావాలని వచ్చే మిలిటరీ వ్యక్తుల వెంట ఎవరైనా ఆడవాళ్ళుంటే వాళ్ళిద్దరూ దంపతులని ఋజువైతే గానీ వాళ్ళకు గదులు యివ్వకూడదు' అని.

గదిఒకటి కావాలని సుబ్బారావు అడిగిన వెంటనే "మీరిద్దరూ భార్యా భర్తల్లాగ అనిపించడం లేదు. అందువలన గది మీకివ్వడానికి వీల్లేద"న్నాడు ఆ హోటల్ మేనేజరు.



ఆ మాట వినేటప్పటికి సూర్యకాంతంకు అరికాలి మంట నెత్తికెక్కినట్టయింది. వెంటనే రౌద్రాకారం దాల్చి భర్త వైపు తిరిగి "చూశారా! మీ తెలివితేటలు యిలా యేడుస్తాయి. పైగా సామాన్లేవీ తీసుకు రావద్దని రాయడమొకటి, సిగ్గులేదూ మీ ముఖానికి? ఇలాంటివన్నీ ఆలోచించకుండా ఎంత చవట మొగుడైనా యిలా రాస్తాడా? ఇంకా అలా వాజమ్మలా నిలబడక–పదండి స్టేషనుకి...." అంటూ భారతం విప్పబోతుండగా వెంటనే హోటలు మేనేజరు ఆమెను ఆపి "అమ్మా! ఈమాత్రం ఋజువు చాలు! ఇందండి గది తాళాలు" అంటూ తాళాలందించాడు!

—బి. గౌరి

## మనిషిలో మనిషి

ఆరు పోర్షన్లు వున్న ఆ పూరింట్లోని చివరి పోర్షనులో దిగారు సుబ్బారావూ సుశీలా నవ దంపతులు.

పులి బోనులోకి అడుగు పెట్టిన మేకపిల్లను చూసినట్లు జాలిగా చూశారు సుశీలవైపు అక్కడున్న వాళ్ళంతా.

పసితనం వీడని పదహారేళ్ళ ముగ్ధ. నిర్మలమైన చూపులు. ముద్ద బంతిలాంటి సుశీల పులివాత పడవలసిందే! రామచిలుక మానభంగం తమ కళ్ళముందు జరగవలసిందే! బాధగా నిట్టూర్చారు ఎవరికి వారు.

నాలుగో వాటాలోవున్న వీర్రాజు ఆ పులి. తల్లి తప్ప మరో తోడులేదు, మెలితిరిగిన మీసాలతో నల్లగా అచ్చోసిన ఆంబోతులా వుంటాడు. ఆ ఇంట్లోనే కాదు ఆ పేటకే హడల్ వీర్రాజంటే. వయసు వచ్చిన ఆడపిల్లలున్న వాళ్ళెవరూ ఆ యింట్లో దిగరు. తెలియక దిగారో కొద్ది రోజుల్లోనే ఆ పిల్ల మీద అత్యాచారం జరగక మానదు.

మారుమూల పల్లెలో పుట్టి పెరిగిన సుశీలకి ఆ వూరు వింత ప్రపంచంలా అద్భుతంగా కనబడింది. తనకు రానున్న ఆపద తెలుసుకోక అక్కడ వుండటం తన పూర్వజన్మ సుకృతంగా భావించింది.

తన అదృష్టానికి పొంగిపోయాడు వీర్రాజు. జున్ను ముక్కలాటి పడుచు చేతికి అందుబాటులో వుంది. సమయం కోసం వేచి వున్నాడు.



ఎచ్చిన వారంలోనే సుబ్బారావు కాంపు పని మీద పొరుగూరు వెళ్ళాడు.

వూరంతా బలాదూరు తిరిగి రాత్రికి యింటికి చేరాడు వీర్రాజు. తను పొందబోయే సుఖాన్ని తలుచుకుంటూ గుటకలు మింగుతున్నాడు. గేటు తీసుకుని కాంపౌండులోకి అడుగు పెట్టేసరికి కెవ్వుమన్న కేకతో ఒక్క పరుగున బయటకి వచ్చింది సుశీల. ఎదురుగా వున్న వీర్రాజుని కావలించుకుని "అన్నయ్యా! వాడు చూడు. నన్నల్లరి పెడుతున్నాడు." అంది గడగడ వణికిపోతూ.

ఆ సంబోధన అతని మనసుని తాకి వింత అనుభూతిని కలిగించింది. అతనిలోని మరో మనిషి మేల్కొన్నాడు. "ఎవడ్రాడు! దొంగనా కొడుకు! నా చెల్లెమ్మమీద చెయ్యేస్తావురా!" అని బూతులు తిడుతూ ఎడాపెడా కుమ్మేశాడు వాడిని. "మళ్ళీ ఎప్పుడైనా నా చెల్లెమ్మని కన్నెత్తి చూశావో, గొయ్యితీసి పాతేస్తాను. జాగ్రత్త" విసురుగా బయటకి తోశాడు ఆ కుర్రాడిని. యిదే సందని పరుగు లంకించుకున్నాడు ఆ కుర్రాడు.

భయంతో వణికిపోతూ గోడకి కరుచుకుపోయింది సుశీల. "అన్నయ్యా! సమయానికి నువ్వొచ్చావు. లేకపోతే నేనేమైపోయేదాన్నో." అని బావురుమంది.

"వూరుకోమ్మా! వూరుకో. నేనున్నాగా. నీకేం భయంలేదు. అంతగా అయితే బావొచ్చిందాకా అమ్మ నీకు తోడు పడుకుంటుందిలే." అన్నాడు లాలించుతున్నట్లు.

ఆ గల్లంతుకు బయటకి వచ్చిన అన్ని వాటాల వాళ్ళూ అనుకోని సంఘటనకి 'ఆశ్చర్యంగా చూశారు. 'కలా! నిజమా!' అన్నట్లు.

—సరస్వతి

## ముష్టి

గుడిలోనుంచి బయటకు వచ్చింది వర్ధనమ్మ. మెట్ల ప్రక్కగా కూర్చుని వున్నారు బిక్షగాళ్ళు అనేకమంది. తమ చేతులలో వున్న గిన్నెలను ముందుకు చాచి "తల్లీ ధర్మం" అంటూ యాచిస్తున్నారు.


కుంటివాళ్ళు. గుడ్డివాళ్ళు. పసిపిల్లలు పండు ముసలివాళ్ళు అనేకమంది దరిద్రానికి వారసుల్లాగా కూర్చొని వున్నారు. వాళ్ళందరినీ చూస్తుంటే చెప్పలేని అసహ్యమూ. ఏవగింపు. కోపం కలిగాయి వర్ధనమ్మకు.

ఒక్కరికి కూడా ఒక్క పైసా ధర్మం చేయటం యిష్టం లేదామెకి.

"ముష్టి వెధవలు" అని మనస్సులో అనుకొని వాళ్ళ ముఖం చూడడమే పాపం అన్నట్లుగా సాగిపోయింది ఆమె.

మెట్లచివరగా కూర్చొన్న రెండు కాళ్ళులేని ముసలివాడు "తల్లీ! రెండు కాళ్ళులేని ముసిలోణ్ని. దయతలచి పది పైసలు ధర్మం చేసి పుణ్యం కట్టుకోమ్మా" అని గిన్నెను ముందుకు చాచి ఆమె కాళ్ళకు దణ్ణం పెట్టబోయాడు.

తన కాళ్ళను తాకబోతున్న వాడి చేతులను చూసి పాముని చూసినట్టుగా భయపడింది వర్ధనమ్మ.



"యూ డర్టీ బెగ్గర్" అని వాడిని తిట్టి గబగబా మెట్లు దిగింది.

'అసలీ ముష్టి వెధవలనందరినీ కాల్చిపారేస్తే తప్ప యీ దేశం బాగుపడదు. ఎక్కడ పడితే అక్కడ తయారు వీళ్ళు' అని తిట్టుకుంది మనస్సులో.

"రిక్షా కావాలా అమ్మా" వర్ధనమ్మను చూస్తూనే అడిగాడు ఒక రిక్షావాడు.

"గాంధీ బొమ్మ దగ్గరికి ఏం తీసుకుంటావు?" అనడిగింది.

"మీకు తెలియనిదేటుందమ్మగారూ! రూపాయిప్పించండి" చెప్పాడు.

"రూపాయా? ఏమంత దూరముందని రూపాయి అడుగుతున్నావు? ముప్పావలా యిస్తాను" అన్నది.

"లేదండమ్మగారూ! కష్టం గమనించండి" ప్రాధేయపడ్డాడు రిక్షావాడు.

"తొంభై పైసలిస్తాను. వస్తే రా లేదంటే వెళ్ళు" నిక్కచ్చిగా చెప్పింది.

"సరే రండి" అని వాడు అనగానే రిక్షా ఎక్కి కూర్చొంది వర్ధనమ్మ.

గాంధీ బొమ్మ దగ్గర రిక్షా దిగి రూపాయి కాగితం వాడి చేతికిచ్చింది.

"దయ తలచండమ్మగారూ!" రూపాయి వుంచుకుంటానన్నట్టుగా ప్రాధేయపడ్డాడు.

"అదేం కుదరదు – పది పైసలివ్వు" దబాయించింది. "ముష్టాడి కేశాననుకుంటాను. ఉంచుకోండమ్మా" అని జేబులోనుంచి పది పైసలు తీసి వర్ధనమ్మ చేతిలో పడేశాడు రిక్షావాడు.

—పి. పుణ్యవతి

## మనసులోని మనసు

వరండాలో కూర్చుని వారపత్రిక చదువుతున్న నేను గేటు తీస్తున్న చప్పుడికి తల ఎత్తి చూసాను. ఎవరో ఒక అపరిచిత యువకుడు వస్తున్నాడు. నేను వెంటనే లేచి నిలబడి, "ఎవరు కావాలండి?" అని అడిగాను. "గది అద్దెకిస్తారని తెలిసి వచ్చానండి" అన్నాడతను. అతన్ని తీసుకెళ్ళి గది చూపాను. అద్దెంతో చెప్పాను. అన్నిటికి అతను తల సాంతం ఎత్తకుండానే తల ఊపుతున్నాడు. చాలా అమాయకుడిలా ఉన్నాడే పాపం అనుకుంటూ లోపలికి వెళ్ళిపోయాను.

*

రమణ గదిలోచేరి నెల దాటింది. ఈ నెల రోజులలో అతను ఇంట్లో వాళ్ళకు చేరువయ్యాడు.